కథా నిలయం
6685
KB-3
శ్రీకాకుళం

# 'వి' గతం

మనసులో ఆలోచనలు కదులుతూనే వున్నై. అంతా గజిబిజిగా వుంది. కారు ప్రయాణం. చండీఘర్‌నుంచీ అమృతసర్. పక్కన మన్‌జీత్ కౌర్. ఆమె ఉద్యోగం చండీఘర్‌లో. ముప్పై ఏళ్ళ క్రితం పరిచయం. ఇన్నేళ్ళ విశేషాలు –కొన్ని నిన్నామొన్నా చెప్పుకొచ్చింది. ఇప్పుడు మరికొన్ని పూసల్ని గుచ్చుతోంది. ప్రొఫెసర్‌గా ఆమె అనుభవాలు, విశ్వవిద్యాలయం – అంతా రాజకీయాలమయం. అన్నీ అవసరాలూ – అవకాశాలమధ్య మనుషుల 'గేమ్స్'!

అమృతసర్‌లో ఆమె సొంతయిల్లు. తల్లి వుంది. డెబ్బైఏళ్ళ వృద్ధురాలు. పరిచయాలూ.. వివరాలూ...

బ్రేక్‌ఫాస్ట్. రెండు 'స్టఫ్డ్' పరోటాలూ, గడ్డపెరుగూ, నిమ్మకాయ ఊరగాయముక్క వంటింట్లో వంటమనిషి – పంజాబీ మాటలు.

మన్‌జీత్‌కోర్ జోక్‌లు, వివరం తెలీదు. ఆ ముగ్గురూమాత్రం మనసులు కలబోసుకుంటున్నారు. మధ్యమధ్య కినుకతో కూడిన విసుర్లు, విసుగు. ఎవర్ని గురించో పరోక్ష సంభాషణ.

లోటాతో పాలు, ఆత్మారాముడు చాలా ఆనందంగా లేచాడు.

– స్వర్ణదేవాలయం, శోభాయమానంగా 'స్వర్ణకాంతులీనుతోంది. ఏమి కట్టడం! ఎన్ని కట్టడాల ప్రాంగణం. నా మనసునిండా వేనవేల స్మృతి శకలాలు. ఇందిరాగాంధీ మూర్తి! చరిత్రని సృష్టించనూ సృష్టించింది; చరిత్రను తిరగరాయనూ రాసింది!

ఒక జాతి శౌర్యఖనిగా, సంస్కృతీ చిహ్నంగా, ధీరంగా నిలిచి ఆహ్వానిస్తోంది దేవాలయం.

కౌర్ నడుస్తూ, నడిపిస్తూ చరిత్రని చెప్పుకుపోతోంది.

సిక్కుల ఆచార వ్యవహారాలూ, దేవాలయ నియమాలూ, పద్ధతులూ చెప్పింది. స్కార్ఫ్ ఇచ్చింది. తలకు కట్టుకోవటం చూపింది. చేతకాలేదు. తానే కట్టింది. పరిహాసంగా నవ్వింది.

దర్శనం అయింది. గంట పైమాటే. ప్రాంగణమంతా కలయతిరిగాం. ప్రవేశద్వారానికి  దగ్గరగా వచ్చాం. మెట్లమీద కూచున్నాం. గాలి ప్రశాంతంగా స్పర్శిస్తోంది. చల్లని ఊసులు చెబుతోంది. పావురాళ్ళు ఎగిరేవీ, కదిలేవీ, ఆగేవీ పలుకరించేవీ!

సామాజికమైన కబుర్లేవీ చెబుతోంది మన్‌జీత్.

ఆమెని పరీక్షగా చూశాను. నెరసిన జుట్టు. కళ్ళకింది నీలినీడలు. మొహంలో తేజస్సు. పెదవులమీద చిరునవ్వు. మొహంలో గాంభీర్యంతో మిళితమైన ఆదరణ. కళ్ళల్లో అనంతమైన ఆత్మస్థైర్యం.

గుమాస్తాగా చేరి రెండేళ్ళలోనే రిజైన్ చేసి వెళ్ళిపోయిన ధైర్యస్థురాలు – ఆకాలంలో! మా కంపెనీని వదిలసి 'ఎకడమిక్స్' బాట పట్టి – మెట్టు మెట్టుగా డిగ్రీలూ, అంచెలంచెలుగా పదవులూ సాధించింది. హైదరాబాద్ వీడిన తర్వాత అడపాదడపా పరామర్శలు.

నేను ఒకగాటనబడి బండిని ఈడ్చుకొచ్చిన వాణ్ణి.  పదవీవిరమణ చేసి మూడేళ్ళు. ఆమెకింకా మూడేళ్ళ సర్వీసువుంది!

'పెళ్ళెందుకు చేసుకోలేదన్నావ్?' సడెన్‌గా అడిగాను. ఉలిక్కిపడి నావైపు చూసి, సంబాళించుకుంది. చిత్రంగా చేతులు చరుస్తూ 'నేనేమీ అనలేదే!' అని ఎదురు సమాధానాన్ని సంధించింది. నాకు తెలుసు ఏమీ చెప్పదు. ఇష్టంలేదు.

నవ్వాను. లేచింది. నా స్కార్ఫ్‌ని తీసుకుంది. తన బ్యాగ్‌లో పెట్టింది. 'పద, యుద్ధం సంగతులు  చాలా వినాలి' అని కదిలింది. అర్థం కాలేదు నాకు. యాంత్రికంగా కదిలాను. ఆమె నన్ను ఏకవచనంలోనే సంబోధిస్తోంది. ఆ కాలంలో నాకు అసిస్టెంట్‌గా చేరిన మర్నాడే నన్ను 'అరే యార్.. మూర్తీ' అనేసిన యువతి మరి! తండ్రి ఎయిర్‌ఫోర్స్‌లో అధికారి.  ఆ కారణాన్నే సికిందరాబాద్‌లో నివాసం. అప్పుడు అక్కడే ఉద్యోగంలో చేరింది ముందు. జలియన్ వాలాబాగ్‌లోకి ప్రవేశించాం. 'ఘోరం, దారుణం' పదాలకి సాక్షీభూతంగా నిలిచిన నిర్వచనం అది!

చరిత్రని చెప్పింది కౌర్. చూపింది. ఫలకాలు చదివాను. ఆమట్టిని తీసి కళ్ళకద్దుకున్నాను. నా చర్యకి కళ్ళల్లో నీళ్ళని నింపుకుని వింతగా చూసింది మన్‌జీత్. నా కళ్ళు అప్పటికెప్పుడో సజలాలైనాయి.

ఎక్కువసేపు గడపలేకపోయామక్కడ.

హృదయభారంతో బయటపడ్డాం. మనోనేత్రం ముందు శతసహస్ర దృశ్యాలు.

కారు వాఘా సరిహద్దు చేరింది. హడావిడిగా నడుస్తూ, ఏవేవో అనుమతులు సేకరించింది. చెమటలు కక్కుతూ నడక. సరిగ్గా సరిహద్దు! మన జవాన్లతో మాటలు.

మనసు పులకించింది. ఎదురుగా పాక్ సైనికులు. మధ్య 'నోమ్యాన్స్ ల్యాండ్!' నడుచుకుంటూ వెళ్ళాం – వో వందగజాలు. ఫెన్సింగ్‌కి దూరంగా అవతలవైపు ఎవరో గడ్డికోస్తున్నారు.

సరిహద్దు రాయి. నన్ను నిలబెట్టి ఫోటో తీసింది కౌర్. 'పాక్‌వైపు నిలబడు' అడిగింది. 'నో. తప్పు' అంతాఎమోషనల్; సెంటిమెంటల్!' నవ్వింది. 'అవును' 'అందుకే హైదరాబాద్ టూ అమృతసర్' 'అన్నది గూఢంగా. ఎత్తిపొడుపు ధ్వనించింది. నేనేమీ ప్రతిస్పందన చూపలేదు.

రొప్పుకుంటూ, రొజుకుంటూ గబగబా నడుచుకుంటూ కారు దగ్గరకి చేరాం. ఎండ దంచుతోంది. కారు పరిగెత్తింది.

కౌర్ ఇల్లంతా యుద్ధరంగంగా వుంది. ఎవరెవరో వచ్చి వున్నారు. హాల్లో మాటలు జోరుగా సాగుతున్నై. ముగ్గురు స్త్రీలు. నలుగురు పురుషులు. వాళ్ళల్లో ఒకాయన వృద్ధుడు. వీరందరి మధ్యనా బోనులో సింహంలా కౌర్‌తల్లి. మన్‌జీత్ తమ్ముళ్ళుముగ్గురూ. మరదళ్ళూ. పెద్దాయన పెద్ద తమ్ముడి మావగారు. మమ్మల్ని చూసి సర్దుకున్నారు. తాత్కాలిక నిశ్శబ్దం. నిశ్శబ్దంమధ్యలో మాటల కట్లూ– మరకలూ! కౌర్ ముక్తసరి పలకరింపు లంచ్. మా యిద్దరికే. ఏదో అపరాధ భావంతో పెద్దావిడ పరామర్శలూ... ప్రశ్నలూ... ఆతిథ్యం. కౌర్‌మొహంలో కొంత విచ్చాయ. అయినా గాంభీర్యంతో వడ్డన. వారంతా ఎందుకు వచ్చారో, వ్యవహారమేవిటో, గలాటా ఎందుకో, అప్పుడు జరుగుతున్నదేవిటో ఆమె చెప్పలేదు.

వెజ్ సలాడ్, రోటీ, ఆలూ మట్టర్. దాల్ మకానీ, పనీర్ కోఫ్తా, రెండు రసగుల్లాలూ, ఇంత అన్నం, గిన్నెడు పెరుగూ, సుష్టుగానే భోంచేశాను. ఆబగా అన్నీ అంతో ఇంతో తిన్నాను.

నిద్ర సుఖమెరుగదు.

లేచేసరికి నాలుగు. బిస్కెట్, కాఫీ! నాకోసం ఆ కాఫీ!

హడావిడిగా ప్రయాణం. స్వర్ణదేవాలయం శిల్పాకృతిని జ్ఞాపికగా యిచ్చింది మన్‌జీత్. ఆమె తల్లికి ధన్యవాదాలు చెప్పి కదిలాను. దారిలో ఆ మధ్యాహ్నం వాళ్ళింట్లో వారిగురించి అడిగాను. ఏమీ చెప్పలేదు. నవ్వి వూరుకుంది.

స్టేషన్‌లో స్వర్ణ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా వుంది. ఎక్కి కూర్చున్నాం.

"ముప్పై ఏళ్ళ తర్వాత -పునర్దర్శనం. మంచి అనుభూతి" అని కరచాలనం చేసింది కౌర్. బ్యాగ్ తెరిచి ఒక కవర్‌ని బయటకి తీసి నా చేతికిచ్చింది. "నీ టూరంతా అయి ఇంటికి వెళ్ళిన తర్వాత, తీరిగాగ వున్నప్పుడు చూడు" అన్నది.

"గుడ్" అని మాత్రం అని ఆమె కళ్ళల్లోకి చూశాను. కళ్ళు చికిలించింది. లేచి నిలబడింది. వీడ్కోలు సమయం.

"గతంలో బతుక్కు, ప్రస్తుతంలో జీవించు" అని "బై..." చెప్పింది. వేదాంతిలా నవ్వుతూ బోగీలోంచీ దిగిపోయింది. వెనక్కి తిరిగి చూడకుండా గబగబా ప్లాట్‌ఫారమ్‌ని కొలుస్తూ నిష్క్రమించింది.

కనుచూపు అనినంతవరకూ చూస్తూనే వున్నాను.

రైలు బయల్దేరింది.

మనసు పరిపరి తలపుల్లో గిరికీలు కొట్టసాగింది.

మన్‌జీత్ కౌర్ నీతివాక్యానికి కారణం ఏమిటి? నా గురించి ఏమనుకున్నది? చండీఘర్‌లో ఉన్న రెండురోజుల్లో నేను నా గురించి చెప్పుకున్న 'ఘోష' ఆధారంగా నన్నెలా అంచనా వేసుకుంది?

అసలు నేను చండీఘర్, అమృతసర్ ఎందుకొచ్చాను?

ఏదో విపరీతమైన ఆవేశం, ఉద్వేగం గొంతుకలో ముద్దకట్టినట్లయింది. నిదానంగా మింగాను. నీళ్ళు త్రాగి గొంతు సరిచేసుకున్నాను.

మేగజైన్ తీశాను. ఒకమాట అంటూ అనేక మాటలు చెప్పిన సంపాదీయకం. రాజకీయాన్నీ, సామాజిక దుర్గంధాన్నీ వీచింది. లోపలి పేజీలు తిరగేశాను. వర్తమాన ఛిద్రపటం వివిధరేఖల్లో దర్శనమిచ్చింది. పక్కన పడేశాను.

నా బతుకు పుస్తకం లోపలి పేజీలు కొన్ని దృశ్యమానమైనై - తలపుల తెరమీద. కొన్ని బొమ్మలు అసహ్యాన్ని కలిగిస్తున్నై. కొన్ని ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నై. కొన్ని జవాబులేని ప్రశ్నల్ని సంధిస్తున్నై.

రైలు పరిగెడుతోంది. కనుకు పట్టింది.

న్యూఢిల్లీ చేరేసరికి రాత్రి పన్నెండు దాటింది. ప్లాట్‌ఫారమ్ మీద నా బోగీకి ఎదురుగానే నిలబడ్డాడు ప్రవీణ్. సాదరంగా స్వాగతం చెప్పాడు. సూట్‌కేస్ తీసుకున్నాడు. వినయపూర్వకమైన మాటలు. వొదిగి వొదిగి నడక.

కరోల్‌బాగ్‌లో అతని ఇల్లు. టాక్సీలో ఎక్కాము.

"నా తిండి అయింది" అన్నాను దారిలోనే. ఫోన్లో అతని భార్యకిచెప్పాడు. ఇల్లు చేరాము. భార్యని పరిచయం చేశాడు. చాలా ఏళ్ళక్రితం ఒక్కసారే చూశానామెను. గుర్తు లేదు. పేరు మధుమతి. నమస్తే చెప్పి లోపలికి వెళ్ళింది. రెండు గదులు, హాలు, కిచెన్ ఎపార్ట్‌మెంట్. ఒక గది చూపాడు ప్రవీణ్. "చిన్న యిల్లు. ఎటాచ్‌డ్ బాత్ దీనికొక్కదానికే వుంది". అపాలజిటిక్‌గా అన్నాడు. "నో ప్రాబ్లెమ్" అన్నాను. "మీరు హోటల్ చూడమన్నారు. కానీ రాకరాక. ఇన్నేళ్ళ తర్వాత వచ్చారు. ఈమాత్రం అవకాశాన్ని వదులుకోకూడదని మీకు శ్రమ యిస్తున్నాను" "ఇట్స్ ఓకే" అన్నాను.

"ఇటు రండీ" పిల్చింది మధుమతి. ఆ పిలుపులో విసుగూ, చిరాకూ, గద్దింపూ మిళితమై వున్నై. నా కెందుకనో మనసు చివుక్కుమంది. ప్రవీణ్‌ముఖ కవళికలు మారాయి.

ప్రవీణ్ లేచి లోపలికి వెళ్ళాడు. "ఆయనకేమైనా ఇవ్వాలా?" ఆమె ప్రశ్న. అతను నా గదికి వచ్చాడు. అడిగాడు. "సార్. మిల్క్ తీసుకుంటారా?" వద్దన్నాను. "ష్యూర్?' "యా" అతను వెళ్ళి ఆమెకి చెప్పి వచ్చాడు. "మీరు రెస్ట్ తీసుకోండి సార్. రేపుఉదయం ప్రోగ్రాం డిసైడ్ చేద్దాం. నేను సెలవు పెట్టాను" అని గుడ్‌నైట్ చెప్పి వెళ్లాడు. టీపాయ్ మీది వాటర్ జగ్‌ని చూసి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను. డ్రెస్ మార్చుకుని బెడ్‌మీదికి చేరాను. లైట్ స్విచ్ ఆఫ్ చేశాను. వీధి దీపం వెలుగు సన్నగా... గది కిటికీలోంచి ... వచ్చి టేబుల్ మీద గీతలు గీస్తోంది.

ఒక్కక్షణం మధుమతి స్ఫురణ కొచ్చింది. మరుక్షణం అ ప్రయత్నంగా కనుమరుగైంది. రెప్పలు మూతబడినై.

– హాల్లో ఏదో కోలాహలంగా వుంది. నిద్ర మత్తు పూర్తిగా వదిలింది. టైమ్ ఎనిమిది.

"మీరు వాడికెన్ని సౌకర్యాలు కల్పించినా, ఆ మొద్దు వెధవకి చదువురాదు. నాన్న కూచి. చూశారుగా ఆ మార్కులు. తల కొట్టేసినట్లవుతోంది నాకు. పైగా నా దురదృష్టం కొద్దీ మా స్కూల్లోనే ఈయన గారి చదువు." మధుమతి మాటలు. డబ్బాలో గులకరాళ్ళలా మోగుతున్నై. ప్రవీణ్‌కి ఇద్దరు కొడుకులు. వారిలో ఒకడి గురించన్నమాట ఈ చర్చ.

సవ్వొచ్చింది. తల విదిలించుకుని లేచి బాత్‌రూమ్‌లో పడ్డాను.

నేను తయారయి హాల్లోకొచ్చే సరికీ, ఆ వ్యవహారం ఇంకా సాగుతోంది. భర్త చేసే గారాబం గురించి ఎత్తిపొడుపుల్ని వదులుతోంది మధుమతి. ఇతనేవో నంజాయిషీల్నీ, వత్తాసునీ... నంగి నంగిగా .. భయం భయంగా వివరణలిచ్చుకుంటున్నాడు.

నా ప్రవేశం వలన ఆ సద్దుమణిగింది. డైనింగ్ టేబుల్ దగ్గరే కూచున్నారు అందరూ. నేనూ వో సీటుని ఆక్రమించాను.

కొడుకులిద్దర్నీ పరిచయం చేశాడు ప్రవీణ్. రాజు చంద్రు. రాజు ప్లస్ వన్‌లో ఉన్నాడు. చందు ఎనిమిది. అతనేనన్నమాట తల్లి మాటల్లోని నాన్నకూచి.

మధుమతి మౌనంగా తన బ్రేక్‌ఫాస్ట్‌ని తాను ముగించింది. ఇడ్లీ, ఉప్మా, బ్రెడ్, జామ్ - ఉన్నై. ప్రవీణ్ నాకు సర్వ్ చేశాడు. తానూ ప్లేట్‌లో పెట్టుకున్నాడు.

నా ప్రోగ్రాం ప్రస్తావన తెచ్చాడు ప్రవీణ్? "ఢిల్లీ అంతా కొట్టిన పిండే కదా నాకు. కేవలం అక్షరథామ్ చూద్దాం. నేను చూడనిది అదే" అన్నాను. "సరే. అట్లాగే" అని "మనం లంచ్ బయట చేద్దాం" అన్నాడు. నేను తలవూపాను.

మధుమతి బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసి లేచింది. తాను స్కూల్‌కి వెళ్ళే త్వరలోవుంది. పిల్లలతిండీ అయింది.

అప్పుడు - పిల్లలిద్దర్నీ ఉద్దేశించి అన్నాడు ప్రవీణ్. "ఈ సార్ మూర్తిగారని చెబుతూ వుంటానే - వారు. వీరి వల్లనే మనమీస్థితిలో వున్నామివాళ" అని. "ఐసీ... మీకు ప్రత్యేక ధన్యవాదాలు సార్" అని నమస్కరించి వుయ్ ఆర్ రియల్లీ గ్రేట్‌ఫుల్ టు యు" అన్నాడు రాజు. అతని కళ్ళల్లో కృతజ్ఞత. మెరుపు! నేను ఆశ్చర్యపోయాను. మాట సంస్కారవంతంగా వుంది. నమస్కారంలో వినయం వుంది. చందూ ఏమీ

అనలేదు. తన గదిలోకి వెళ్ళిపోయాడు. మధుమతి మాత్రం యధాలాపంగా ఎవరికో చెబుతున్నట్టు 'అవును. రోజూ వోసారన్నా ఈయనగారికి మీరు గుర్తుకొస్తారు' అన్నది.

నేను మొహమాట పడ్డాను. దిక్కులు చూస్తూ ప్లేట్‌లో పదార్థాన్ని కెలుకుతూ కూచున్నాను. క్షణం తర్వాత మధుమతే అన్నది. "ఐనా అవన్నీ రొటీన్ ఇన్సిడెంట్స్. ఇంత సెంటిమెంటల్‌గా ఫీల్ కావాల్సిందేవుందో నాకైతే అర్థం కాదు"

నేనేమీ విస్తుపోలేదు. "యా" అన్నాను. ఆమె మాటని బలపరుస్తున్నట్టున ఆ వెంటనే అడిగాను. "స్కూల్లో మీరే టీచ్‌చేస్తారు?" అని. "కంప్యూటర్ సైన్స్" అన్నది ఒకింత గర్వ స్ఫోరకంగా. "గుడ్" అన్నాను.

'ట్రాన్సక్షన్ ఓరియంటెడ్ డీలింగ్స్' అని గొణుక్కుంది నా మనస్సు. తల్లీ, ఇద్దరు కొడుకులూ 'బై' చెప్పి వెళ్ళిపోయారు.

నా టిఫిన్ అయింది. కిచెన్‌లోకి వెళ్ళి కాఫీ చేసి తెచ్చి యిచ్చాడు ప్రవీణ్. తానూ తీసుకున్నాడు.

–టాక్సీ మాట్లాడుకుని కూచున్నాం. టాక్సీ వెళుతోంది. ప్రవీణ్ ఆఫీస్ వ్యవహారాలూ, తన కెరీర్ వివరాలూ, ఇతర మిత్రుల యోగక్షేమాలూ – అన్నీ కలగలిపి చెప్పుకుపోతున్నాడు. నేను వింటూ కూచున్నాను. నా గురించీ నేను అతనికి మెంటార్‌లా వ్యవహరించి, శ్రేయోభిలాషిలా చేసిన సహాయం గురించీ జ్ఞాపకం చేసుకున్నాడు. ఒకటికి పదిసార్లు కృతజ్ఞతలూ చెప్పుకున్నాడు.

నేను అతనికి చేసిన అతిగొప్ప సహాయం నాకూ గుర్తుకొచ్చింది. ప్రవీణ్ మంచి టేబుల్ టెన్నీస్ ప్లేయర్. ఏవో టోర్నమెంట్స్‌కి వెళ్ళొచ్చారు చాలామంది. టి. ఈ. బిల్స్‌ని వారికి అనుకూలంగా రాసుకుని, తప్పుడు టికెట్ నెంబర్లూ వివరాలూ వేసి క్లెయిములు పెట్టారు అందరూ. ప్రవీణ్ వచ్చి నా సలహా అడిగాడు. అప్పటికి అతను బిల్ పెట్టలేదు. వద్దన్నాను. రూల్స్ ప్రకారం క్లెయిమ్ చేయమన్నాను. నా మాట విన్నాడతను. మిగిలినవారని వ్యవహారమంతా ఆ తర్వాత పెద్ద రభసైంది. వారందరికీ క్రమశిక్షణా చర్యల క్రింద చాలా తంతు జరిగి, ఇంక్రిమెంట్స్ కోత వంటి శిక్షలు పడినై. ఇలాంటివే మరికొన్ని ప్రత్యేకించి డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌కి నా ట్యూషన్ అతనికి ఎంతో మేలు చేసింది. రెండు పొజిషన్స్ దాటుకుని ఆఫీసర్ ప్రమోషన్‌ని పొందాడు.

నేను నా ఆలోచన్లో వుండగానే, ప్రవీణ్ నన్ను కదిలించాడు. తన భార్య స్వభావం గురించి వివరణ ఇచ్చుకున్నాడు. ఆమె మాటలకి ఏమీ అనుకోవద్దన్నాడు. అప్పుడే – కొడుకుల గురించీ వాళ్ళ తెలివితేటల గురించీ చెప్పాడు. క్షణం నిదానించి, నా వైపు చూస్తూ అడిగాడు. "ఘనంగా కావాలని మన పిల్లలని చెడ్డవాళ్ళని చేసుకుంటామా సార్?" అని.

నేను గతుక్కుమన్నాను. ప్రవీణ్ ప్రశ్న నా మనో యవనికమీద అనేక అనుభవాల 'ఫ్లిప్ చార్ట్'లని వ్రేలాడదీసింది. అనేక సంభవాల విద్యుద్వేగం నా వెన్నుని జలదరింపజేసింది.

అవాచికంగా ఉండిపోయాను.

టాక్సీ అక్షర్‌ధామ్ చేరింది. నేనూ, ప్రవీణ్ ప్రస్తుతంలోకి వచ్చాము. లోపలికి నడిచాం.

అక్షరధామ్‌ని చూడటం ఒక అపూర్వమైన అనుభవం అనిపించింది. అపూర్వమైన కట్టడం. అద్భుతమైన నిర్మాణం. మా వీక్షణం అయి, కన్నాట్‌ప్లేస్‌కి వచ్చాం. మద్రాస్ హోటల్లో గంట నిరీక్షణ తర్వాత లంచ్. ఆ తర్వాత సరాసరి న్యూఢిల్లీ స్టేషన్‌కి చేరాము. ఏ.పీ. ఎక్స్‌ప్రెస్‌లో నా హైదరాబాద్ ప్రయాణం.

ప్రవీణ్‌ని వెళ్లమన్నాను. వొప్పుకోలేదేతను. వెయిటింగ్‌హాల్లో కూచున్నాం. తనదైన విధానంలో ఏవో ఆఫీస్ కబుర్లు చెబుతున్నాడు ప్రవీణ్.

ఉన్నట్టుండి నా చూపులు ఎదుటి సీట్లో ఉన్న యువకుడి మీద నిలిచాయి. అవును అతను వెంకటరెడ్డి! ఒకప్పుడు కడపలో నేనూ నా కుటుంబం వాళ్ళింట్లోనే అద్దెకున్నాం. లేచి వెళ్ళి పలకరించాను. అతనూ నిలబడి విష్ చేశాడు. నన్నూ అతను గుర్తుపట్టాడు. ఇద్దరికీ సంతోషంగా ఉంది. సూట్‌కేస్ తీసుకుని వచ్చి నా పక్కసీట్లో కూచున్నాడు.

"చెప్పండి అంకుల్ ఎలా వున్నారు? ఎక్కడుంటున్నారు?" అడిగాడు. "బాగానే వున్నాం. రిటైరయి హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాను" చెప్పాను. ప్రవీణ్‌ని పరిచయం చేశాను.

ప్రవీణ్ మా స్థితి గమనించి లేచాడు. "అయితే నేను సెలవు తీసకుంటాను సార్" అని పాదాభివందనం చేశాడు. నేను లేవదీసి, "గాడ్ బ్లెస్‌యు బెస్టాఫ్‌లక్" అని ఆశీర్వదించాను.

మళ్ళీ థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు ప్రవీణ్.

వెంకటరెడ్డీ నేనూ కబుర్లు సాగించాం.

"మీనాన్న గారెలా వున్నారు?" అడిగాను వెంకటరెడ్డి మొహం విషణ్ణమైంది. "ఆయన పోయి ఆరేళ్ళయింది. అంకుల్" అంటూ గతాన్ని పంచుకున్నాడు. వెంకటరెడ్డి తమ్ముడు రాజకీయాల్లోకి దిగాడు. అందునా ఫ్యాక్షన్ ముఠా రాజకీయాలు. తల్లిదండ్రులకీ అన్నకీ యిష్టంలేదు. వీళ్ళ మాట వినలేదతను. ఆ తర్వాత ఆ రకమైన వ్యవహారాల్లోకీ జులాయి తిరుగుళ్ళకీ, తాగుడుకీ అలవాటు పడ్డాడు.

తండ్రి ఇంట్లోనుంచి వెళ్ళిపొమ్మన్నాడు. మాటామాటా పెరిగింది. ఆస్థి పంచమన్నాడు. "అదంతా నా స్వార్జితం. ఏంవీ ఇవ్వనన్నాడు తండ్రి" కొన్నాళ్ళు ఘర్షణ పడ్డాడు. చివరికి వొకరోజు ఆవేశంలో తండ్రిని గోడకేసి కొట్టాడు. తలకి దెబ్బ తగిలింది. చాలాకాలం వైద్యం జరిగింది. పక్షవాతం వచ్చింది.

ఆ అనారోగ్యంతోనే తీసుకు తీసుకు పోయాడు. ఇప్పుడా తమ్ముడి జాడ తెలీదు. వెంకటరెడ్డా ఏదో ఇన్సూరెన్స్ కంపెనీలో మంచి ఉద్యోగంలో వున్నాడు. ఇదీ రెడ్డి చెప్పిన కుటుంబగాథ. "అమ్మెక్కడ?" అడిగాను. "ఆమె కడపలోనే వుంటోంది. అడపా దడపా మాకాడికి వస్తా పోతా వుండాది" అన్నాడు. "నేనూ నా భార్యాపిల్లా హైదరాబాద్‌లో వుంటున్నాం" చెప్పాడు. నాకుమనసంతా వికలమైంది. చాలాసేపు ఇద్దరమూ మౌనంగా వుండిపోయాం. ట్రెన్ వచ్చింది. వెళ్ళి ఎవరి బోగీల్లోకి వాళ్లం ఎక్కాం. చాలాసేపటికి వెంకటరెడ్డి నా బోగీలోకి నా సీటు దగ్గరకొచ్చి తన విజిటింగ్ కార్డిచ్చాడు. "తప్పకుండా – ఇంటికి రండి సార్ – వోసారి" అని ఆహ్వానించాడు. నేనూ అలాగేనన్నాను. అతను సీట్లోకి వెళ్ళిపోయాడు.

ట్రెన్ కదిలింది. ఏసీ కోచ్ అయినా నాకు ఉక్కపోస్తున్నది. మానసికమైన వొత్తిడి. వెంకటరెడ్డి తమ్ముడిగురించిన ఆలోచన నాకు హృదయభారం కలిగించింది. ఆ తండ్రివేదన, అంతర్మథనం –నేనూ అనుభవిస్తున్నానా?"

రుమాలుతో మొహం తుడుచుకున్నాను.

నా చిన్నకొడుకు సుందరం నా ఆలోచనల్లో పరిభ్రమిస్తున్నాడు. వారి పక్షాన నా భార్య ప్రమీలాదేవి. ఆమె వాడికి తోడు, ఆమె వాడికి వత్తాసు. ఆమె వాడి మాటలకి చోదకశక్తి. ఆమె వాడి చర్యలకి వెన్నుదన్ను! అయిద్దరూ కలిసి చేస్తున్నదేమిటి?

కళ్ళముందు ఏదో దుస్స్వప్నను నీడలు! గట్టిగా కళ్లు మూసుకున్నాను. అయినా - వదరుబోతు స్త్రీమూర్తీ, పెరిగిన గడ్డం మీసాలతో, చింతనిప్పుల కళ్ళతో ఆ నడివయస్కుడూ - కళ్ళముందు నిలిచే వున్నారు. ఒకరు వ్యంగ్య వ్యాఖ్యానాలతో నన్ను రాపాడుతున్నారు. మరొకరు చూపుల గద్దింపుతో హెచ్చరికలు చేస్తున్నారు. వీరిద్దరికీ అందనంత దూరంలో తన ఉద్యోగం తాను చేసుకుంటూ, భార్యతో, పిల్లతో - సుఖ జీవనం చేస్తున్న పెద్ద కొడుకు సురేశ్. కొడుకులిద్దర్నీ సమంగా పెంచలేదట. అందుకనే సుందరం 'చెడి'పోయాట్ట!

టీటీయీ రాకతో ఈ లోకంలోకొచ్చాను. టికెట్ చూపించాను. చుట్టూ ప్రయాణీకుల మాటలూ, హడావిడీ, టీటీయీ వెళ్ళిపోయాడు. నా ముందు ఒక వృద్ధ దంపతుల జంట. వారి కూతురో, కోడలో - వంటి యువతి. నా పక్కన ల్యాప్‌టాప్‌లో తల దూర్చిన యువకుడు. అతని పక్కన అతని భుజం మీద తల ఆనించి కంప్యూటర్లోని విషయాల్ని చూస్తున్న యువతి. అందరూ వారి వారి మౌన ప్రపంచంలో వున్నారు.

నా బ్రీఫ్‌లో నుంచీ మన్‌జీత్ కౌర్ ఇచ్చిన కవరు తీశారు. చించి, కాగితాన్ని బయటకి తీశాను. ముత్యాలకోవ వంటి ఆంగ్ల అక్షరాలు పలకరించాయి.

'మూర్తీ, నీ కుటుంబం సమస్యని చెప్పి నా సలహా అడిగావు చండీఘర్‌లో. అమృతసర్‌లో పెళ్ళెందుకు చేసుకోలేదన్నావ్ అనే ప్రశ్న వేశావ్! పెళ్ళి సంగతి. యుద్ధంలో చనిపోయారు నాన్న. అమ్మా, ముగ్గురు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళూ - చరాస్థిగా యిచ్చాడు. స్థిరాస్థిగా మా అమృత్ సర్ ఇల్లు! నేను బతుకు యుద్ధంలోకి దిగాను. చిత్తశుద్ధితో బాధ్యతతో అందర్నీ సమానంగా సాకాను. వాళ్ళ పెళ్ళిళ్ళూ పేరంటాలూ అయినై. అప్పటికి నా వయస్సూ నన్ను వెక్కిరించింది. అందరూ జీవితంలో స్థిరపడ్డారు. చిత్రమేమిటంటే - ఆ ఐదుగురికీ ఒకర్ని చూస్తే ఒకరికి కోపం, ఈర్ష్య, అసూయ! కారణం సింపుల్. ఏదో వొక విషయంలో ముఖ్యంగా డబ్బు విషయంలో -ఒకర్నొకరు పోల్చుకుంటారు. ఆఅసమానతని కొండంత చేసుకుని కొట్టుకుంటూ వుంటారు. చివరికి అందరూ కలిసి నా మీద నిందవేస్తారు. ఎవరికి వారికి - తనని నేను సరిగా సంరక్షించలేదనే నెపం. చిత్రమైన విషయం కదా! ఇవ్వాళ గలాటా చూశావు కదా. ఆ యిల్లు నాన్న స్వార్జితం. అది అమ్మకీ, నాకూ కలిసి రాసి పోయారాయన. దాన్ని అమ్మి డబ్బు పంపకాలుచేయమని డిమాండ్.

మూడేళ్ల నుంచీ ఇదీ రచ్చ. ఆ ఐదుగురిలోనూ మళ్ళీ ఆరు పాలిటిక్స్! అంటే, ఆ ఆరో పాత్రని నేనే! చాలాసార్లు నిరుత్సాహం, ఒంటరితనం నా మీద దాడిచేస్తూ వుంటై. ఇప్పుడు నువ్వు చెప్పు. నన్నెక్కడికి పొమ్మంటావ్? పోతే తీరిపోయే సమస్యా ఇది? పక్షిలా ఎంత తిరిగినా మళ్ళీ గూడు వెతుక్కోవద్దూ? ఆలోచించి సలహా యివ్వు. మన్‌జీత్'

పి.యస్: ఆస్థి పంచియిచ్చినా మా వాళ్ళు అమ్మనీ నన్నూ ప్రేమిస్తారా? ఒక్క సందేహం. ఎవ్వరిచేతా ప్రేమించబడకుండా ఎందుకు బతుకుతన్నాం?

- ఉత్తరాన్ని మడిచి కవర్లో పెట్టి, దాన్ని బ్రీఫ్‌లో వుంచాను.

మేథలో - మన్‌జీత్ ప్రశ్న! బుర్ర వేడెక్కింది. లేచి ఫ్యాన్ వేసుకున్నాను. పక్కవాళ్లు అదోలా చూశారు నావైపు.

టీ వచ్చింది. ఆ వెంటనే లస్సీ వచ్చింది. లస్సీ తీసుకున్నాను. త్రాగాను. ప్రాణానికి కొంత హాయనిపించింది.

ఎదురుగా కూచున్న యువతి దుఃఖంతో వున్నట్లుంది. కళ్ళల్లో నీళ్ళు. ఏడుస్తోంది. ముక్కుపుటాలు అదురుతున్నాయ్. పక్కనున్న పెద్దావిడ తొడమీద తలపెట్టి ముఖం దాచుకుంటోంది. ఆమె సానునయంగా ఆ యువతి భుజం నిమురుతోంది. 'ఏడవకే', ఊరుకో! ఏడిస్తే తీరే సమస్యా ఇది?' అని సన్నగా అంటోంది. ఈ యిద్దర్నీ చూసి విచారిస్తున్నాడల్లే వుంది. పెద్దాయన పేపర్‌ని తీసుకుని మొహం చాటు చేసుకున్నాడు. ఏమిటో బాధ?

నాకేదో తత్త్వం గుర్తుకొచ్చింది. 'ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి తెలుసు? ఏదారెటు పోతుందో ఎవరికి తెలియదు'! అవునా?

మానసిక ప్రశాంతత కోసం సమస్య నుంచీ దూరమవుదామని - దారులు వెతుక్కుంటూ దూరంగా, దూరంగా - వెళ్తే జరిగిందేమిటి? మన్‌జీత్ కౌర్ నా ముందు పెట్టినదేమిటి? ప్రవీణ్ భార్య మధుమతి ఏమంటుంది? తండ్రి నిర్లక్ష్యం వల్లనే కొడుక్కి చదువురావటం లేదనా? అయితే తన్న శ్రద్ధా, లక్ష్యమూ ఏం చేస్తున్నాయ్ - ఆ కొడుకుని? ఆశించిన చదువునెందుకు రప్పించటం లేదూ? అసలీ సంరక్షణలూ, బాధ్యతలూ - సంతానాన్ని తీర్చిదిద్దుతాయనే గ్యారంటీ ఏమిటి? అదే నిజమైతే, సమానావకాశాలూ, సమాన పోషణా, సమాన ఆదరణా - అందించినా

సంతానమంతా ఏ తేడాలూ లేకుండా బతికీ, పెరిగీ ఒకే స్థాయి అభ్యుదయాన్నీ, ఆనందాన్నీ, సాధించగలరా? అసలు – ఏది అభ్యుదయం? ఏది ఆనందం? ఒకే స్థాయికి కొలబద్ద ఏమిటి?

నాలో చాలా పెద్ద కల్లోలమే చెలరేగింది.

దీని మధ్యగా – నా ముందున్న పెద్దాయన హీనస్వరంతో అన్న మాటలు కొరడా ఝుళిపించాయి. ఆయనంటున్నాడు. "ఎవరి కర్మ కెవరు కర్తలం? వాళ్లింత దుర్మార్గులనీ, వాడింత ఛండాలుడనీ కలగన్నామా? ఇంతకీ డబ్బు పాపిష్టిది! కానీ, మన పిల్ల మనకు బరువేం కాదు"

కథ బాగానే అర్థమైంది నాకు.

పెద్దావిడ అన్నిటికీ ముక్తాయింపుగా "రోజులు బాగాలేవు. ఏం చేస్తాం?' అని ముక్కు చీదుకుంది. ఆ యువతి తలెత్తి కళ్ళు తుడుచుకుని, లేచి టాయిలెట్ కేసి నడిచింది.

ఏదో సుడిగాలి తరుముకొస్తున్న భావనతో ఇందాక పక్కనబెట్టిన మేగజైన్‌ని చేతిలోకి తీసుకున్నాను. పేజీలు తిరగేస్తున్నాను. ఏదో వ్యాసంలో చివరిపేరా మీద దృష్టి ఆనింది. 'బాధలను, కష్టాలను, అర్థం చేసుకోవటంతోనే సరిపోదు. అంతటితో,న ఆగిపోకూడదు. మనల్ని మనం ఎలా మార్చుకోవాలో తెలుసుకోవాలి.. తనమార్గాన్ని తాను నిర్మించుకోవాలి. తన తరువాత వారికి అంతకంటే సురక్షితమైన బాటల్ని నిర్మించాలి...

మళ్ళీ చదువుకున్నాను.

వెంకటరెడ్డి తమ్ముడు గుర్తుకొచ్చాడు.

మన్‌జీత్ తమ్ముళ్ళూ గుర్తుకొచ్చారు. ప్రవీణ్ కొడుకు చందూ కళ్లముందు నిలిచాడు. మా సుందరమూ పక్కగా నిలిచినట్లనిపించింది.

అందరూ – ఒక 'అయ్య తరువాత' వారు!

వారందరూ అయ్యనుంచీ ఆశిస్తున్నది ఒక్కటే!

బాధ్యతా నిర్వహణ! ఏమిటా బాధ్యత? 'డబ్బు'!

వండర్‌ఫుల్!

ఉన్నట్టుండి నా కళ్ళముందు నా యింట్లో గ్రంథాలయం, దానిలోని వందలకొద్దీ పుస్తకాలూ ప్రత్యక్షైనాయి. ఐజీ నెట్ కూడా దర్మనీయంగా దృగ్గోచరమైంది. చాలా గొప్ప విశ్వరహస్యాల్ని ఛేదించినట్లనిపించింది. తీసుకుపోయి, వాటినన్నింటినీ ఏ సముద్రంలోనో పారబోయవచ్చు!

– రాత్రికి డిన్నర్ చేయాలనిపించలేదు. తొమ్మిది గంటలకల్లా పడుకున్నాను. మెలకువా, నిద్రా కాని స్థితిలోనే ఆ రాత్రి గడిచింది.

మర్నాడు రాత్రికి ఇంటికి చేరాను. నా కోడలు – సురేశ్ భార్య దీప. నా మనవరాలు ప్రీతీ వున్నవారింట్లో, నెమ్మదిగా విశేషాలు చెప్పింది దీప. సుందరం హాస్పటల్‌లో వున్నాడు. ప్రమీల అతని దగ్గర వుంది. సురేశ్ వచ్చి, చూసి – ఇవాళే తిరిగి వెళ్ళాడు. మొన్నరాత్రి సుందరం సూసైడ్ ప్రయత్నం చేశాడు. ప్రమాదం గడిచింది.

నాకు బుద్ధిలోని అన్ని తార్కిక శక్తులూ ఇంకిపోయినట్లయింది. ఆరాత్రి నేను హాస్పటల్‌కు వెళ్ళలేదు.

మర్నాడు ఉదయం ప్రమీల ఇంటికొచ్చింది. పొడిపొడి మాటలు సాగినై మాటలమధ్య ఆమె సూదుల్ని ఆమె గుచ్చింది.

నేను హాస్పటల్‌కి వెళ్ళి సుందరంని చూశాను. కొంతమందికి చావుకూడా సులభంగా దక్కదు' అన్నాడు కటువుగా. చూపుల్లో వైమనస్యం. నేనూ ఎక్కువగా మాట్లాడలేదు. వచ్చేశాను.

పగలంతా గమ్యంలేని చెడుతిరుగుడు తిరిగాను.

ఆ రాత్రికి సుందరం ఇంటికి వచ్చాడు.

'మనంగా కావాలని మన పిల్లల్ని చెడ్డవాళ్లని చేసుకుంటామా సార్?' –ప్రవీణ్ అంతర్వేదన నా సంవేదనలోనూ ధ్వనిస్తోంది!

'ఎవరి కర్మకెవరు కర్తలు?' రైల్లో పెద్దాయన వేదాంతం నాకు తృప్తి చుక్కల్నిస్తోందేమో!

ఆలోచిస్తూనే పడుకున్నాను.

"ఎవ్వరిచేతా ప్రేమించబడకుండా ఎందుకు బతుకుతున్నాం?" మన్‌జీత్ ప్రశ్న నిద్రపట్టనీయటం లేదు.

వ్యాపారం చేసుకోవటానికి 'డబ్బు' కావాలని సుందరమూ, వాడికి వత్తాసిస్తూ ప్రమీల చేసిన రగడా, మూణ్ణెళ్ళనుంచీ మరీ ఉధృతంగా సాగిన డాడీ, రచ్చా... అన్నీ బొమ్మకట్టాయి, నా కళ్ళముందు. మానసిక ప్రశాంతత కోసం 'యాత్ర'లకి పోయాను. కానీ, సాధించేందేముంది? ప్రశాంతత దొరికిందా? అసలెక్కడ వుంది ప్రశాంతత?

చప్పున స్ఫురించింది మన్‌జీత్ సలహా. 'గతంలో బతుక్కు ప్రస్తుతంలో జీవించు!'

లేచి కూర్చుని ఊపిరి సలపనంత పనిచేశాను.

భళ్ళున తెల్లవారింది!

రెండురోజుల్లో కావలసిన కార్యక్రమాన్ని పూర్తిచేశాను. 'ఇప్పుడు ఏడుస్తూ, నన్ను శపిస్తూ, నా తదనంతరం సుఖపడటానికి ఎందుకు ఎదురుచూడాలి వీళ్ళంతా?' అనే జ్ఞానోదయం అయింది!

ఇవాళ,

నేను నాకున్న కొద్దిపాటి సామానుతో బయటికి నడిచాను. అటు నా పెన్షన్ భరోసా; ఇటు ఆనందం డిగ్నిటీ హోమ్ ఆదరణ – నా నడకకి ఉత్తేజాన్నిస్తున్నాయి!!!

మనసు ప్రశాంతంగా వుంది. బహుశా దాని పుట్టిల్లు అదే కాబోలు!!!

–చినుకు మాసపత్రిక, ఏప్రిల్, 2012